మహనీయుల త్యాగఫలితమే స్వాతంత్య్రం

ఉత్సాహంగా తిరంగా ర్యాలీలు


హుస్నాబాద్: ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

హుస్నాబాద్: మహనీయుల త్యాగ ఫలితంగానే దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేశ్ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పతాకంతో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తాలో సామూహిక జనగణమనతో ముగించారు. కార్యక్రమంలో లక్కిరెడ్డి తిరుమల, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, స్వరూప, శంకర్ బాబు, వీరాచారి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీ సెంటర్ ఫర్ కల్చర్ రిసోర్స్ అండ్ ట్రెనింగ్ సౌజన్యంతో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతక ముందు ఉపాధ్యాయులు, విద్యార్థులు పొడవైన త్రివర్ణ పతాక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు పంజా రాజమల్లు, లక్కిరెడ్డి వీరారెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోహెడలో...

కోహెడ(హుస్నాబాద్): ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ నేతలు మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సాయిబాబా ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చెపట్టారు. పలువురు ఇంటి వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించి వందనం చేశారు. వెంకటేశం, నర్సయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, సాగర్, రాంచంద్రారెడ్డి, రమేశ్, సతీశ్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడులు జరుగుతున్నా స్పందించడం లేదు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. మురళీకృష్ణాలయం నుంచి ఇందిరాపార్కు చౌరస్తా వరకు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, గురువారెడ్డి, జశ్వంత్‌రెడ్డి, రాంరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న రఘునందన్‌రావు

విద్యతోనే సమాజంలో గుర్తింపు


దుబ్బాకటౌన్: యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

దుబ్బాకటౌన్: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపల పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 90మంది విద్యార్థులకు ఎంప్లాయీస్ యూనియన్ సహకారంతో యూనిఫామ్స్, బెల్టులు, ఐడీ కార్డ్స్, షూస్ పంపిణీ చేశారు. రూ.70వేల విలువైన సామగ్రిని అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సాదత్ అలీ, శ్రీను, బాలేశం, రాములు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాంచంద్రం, యాదగిరి, తదితరులున్నారు.

స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ

వర్గల్(గజ్వేల్): మండలంలోని నెంటూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ వర్గల్ మండల ఇన్‌చార్జి మాసాన్‌పల్లి అశోక్ రూ.45వేలతో వాటిని సమకూర్చారు. కార్యక్రమంలో రంగారెడ్డి, లక్ష్మారెడ్డి, కొండల్‌గౌడ్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా

సిద్దిపేటజోన్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని యూనిట్ టెక్నికల్ మేనేజర్ ప్రశాంత్ పేర్కొన్నారు. వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలోని 12దేశాల్లో విస్తరించి ఉందన్నారు. బుధవారం సిద్దిపేటలోని లక్ష్మీ నరసింహ ఐరన్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా మేస్త్రీలందరికీ రూ.లక్ష ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో డీలర్ దేవేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్టు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్‌కు చెందిన కూన మౌనిక భర్త వేధింపులకు గురిచేయడంతో గత నెల 28న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు అదేరోజు దహన సంస్కారాలు పూర్తిచేశారు. భర్త రవి, అత్త యాదవ్వల వేధింపులు భరించలేకే.. తమ కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మృతురాలి ఎముకలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి, నిందితులైన భర్త రవి, అత్త యాదవ్వలను రిమాండ్ తరలించినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

రాయపోలు(దుబ్బాక): ఇద్దరు యువకుల మృతికి కారణమైన డీసీఎం వాహనం డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత 12న వడ్డేపల్లి శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని డీసీఎం వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు నవీన్, వంశీ మృతి చెందారు. ఆ ప్రమాదంలో గాయపడిన డీసీఎం డ్రైవర్ వడ్లకొండ రాకేశ్‌ను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సాయం


ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫాంను అందజేస్తున్న స్నేహితులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ హైస్కూల్లో 1999–2000లో పదో తరగతి విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. గ్రామానికి చెందిన అంబటి యాదగిరి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 64మంది పూర్వవిద్యార్థులు తమ స్నేహితుడి భార్య లహరి, కూతురు నిహారికల పేరిట పోస్టాఫీస్‌లో రూ.90,516 ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ బాండ్‌ను బుధవారం వారికి అందజేశారు. రిటైర్డు హెచ్‌ఎం వరదారెడ్డి, క్లాస్‌మెట్స్ పాల్గొన్నారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

దుబ్బాకటౌన్: తైబజార్ వసూలుచేసే వ్యక్తిపై దాడికి ప్రయత్నించిన ఓ స్వీట్‌షాపు యజమాని భార్యతో సహా మరో ఇద్దరిపై పోలీసులు బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఘటన దుబ్బాకలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. స్థానిక బస్టాండ్ వద్ద గర్వా మోహన్‌లాల్ అతడి భార్య మేకాదేవి శ్రీబాలాజీ స్వీట్‌షాపు నడుపుతున్నారు. ఇటీవల వారి దుకాణం మెట్ల వద్ద మిర్చి, సమోసా స్టాండ్‌ను కూడా ప్రారంభించారు. దీంతో తైబజార్ నిర్వాహకుడు రమేశ్ వారిని తైబజారు చెల్లించాలని కోరాడు. కాని వారు నిరాకరించారు. దీంతో తైబజార్ నిర్వాహకులు మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం మిర్చి స్టాండ్‌ను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్వీట్‌షాపు యజమాని మోహన్‌లాల్ తైబజార్ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో అతడి భార్య మేకాదేవి తైబజార్ నిర్వాహకుడు బావాజీ రమేశ్‌ను దూషిస్తూ దాడికి యత్నించింది. రమేశ్ ఫిర్యాదు మేరకు స్వీట్‌షాపు యజమాని మోహన్‌లాల్, అతడి భార్య మేకాదేవి, మరో వ్యక్తిపైనా కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

❖ విద్యార్థిని ఆత్మహత్య

చిన్నకోడూరు(సిద్దిపేట): పరీక్షల్లో పాస్ అవ్వలేదని మనస్తాపం చెందిన విద్యార్థిని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ సికింద్లాపూర్‌లో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పండుగ రాజయ్య, లచ్చవ్వలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వారి చిన్న కూతురు భవాని(17) ఇంటర్ మొదటి సంవత్సరంలో ఫెయిలైంది. సప్లమెంటరీ పరీక్షలు రాసినా ఉత్తీర్ణత సాధించలేక పోయింది. దీంతో మనస్తాపం చెందిన భవాని మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

❖ విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కొండపాక(గజ్వేల్): విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గిరాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంతోష్ కుమార్‌చారి తన పొలం దున్నడానికి ట్రాక్టరును డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్న క్రమంలో విద్యుత్ తెగిపోయి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానిక రైతులు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

❖ ఓ వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అపూర్వరెడ్డి కథనం ప్రకారం పుల్లూరుకు చెందిన కొమ్ము శ్రీనివాస్(43) గత 4న సిద్దిపేటకు వెళ్లివస్తానని ఇంటి నుండి వెళ్లి తిరిగిరాలేదు. ఈ క్రమంలో బుధవారం రాఘవాపూర్ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఉండడం స్థానికులు గమనించి పోలీసులకు తెలియజేశారు. మృతుడి భార్య తార ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

❖ రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న నిందుతులను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు పట్టుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా పుట్టగూడెం గ్రామానికి చెందిన మాలోత్ రాజేశ్, గంజి అశోక్ బుధవారం ఓ వాహనంలో బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్, పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు.

❖ పేకాట స్థావరంపై దాడులు

గజ్వేల్‌రూరల్: పోలీసులు ఓ పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. గజ్వేల్ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.25,460 నగదు, 8 సెల్‌ఫోన్‌లు, 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

❖ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని నర్సాపూర్, బీజేఆర్ చౌరస్తాలు, రాజీవ్ రహదారిపై నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.6వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

❖ శిక్షణ తీసుకున్న వారు రాణించాలి


మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

సిద్దిపేటకమాన్: శిక్షణ తీసుకున్న వారు బ్యూటీషియన్‌రంగంలో రాణించాలని జిల్లా పంచాయితీ అధికారి దేవకీదేవి పిలుపునిచ్చారు. ప్రగతి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40రోజులుగా కొనసాగుతున్న బ్యూటీషియన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆమెతో పాటు మహిళా పీఎస్ సీఐ దుర్గ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు శిక్షణ పొందిన 35మంది మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం దేవకీదేవి మాట్లాడుతూ మహిళలు ఉన్నతంగా మారాలన్నారు. మహిళలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే షీటీమ్స్ సహాయం తీసుకోవాలని సీఐ దుర్గ సూచించారు. కార్యక్రమంలో సెట్విన్ సెంటర్ కోఆర్డినేటర్ అమీనా, జయ, సుగుణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

❖ 'మహిళాశక్తి'తో ఆర్థిక అభివృద్ధి

హుస్నాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం టౌన్‌లెవల్ బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళాశక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు రూ.1లక్ష నుంచి రూ.20లక్షల వరకు రుణం మంజూరు చేసేఅవకాశం ఉందన్నారు. ఆ రుణాన్ని సకాలంలో చెల్లించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ ముత్యాల రాజు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

❖ మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

చేర్యాల(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్): మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యమని వాటితో భవిష్యత్ నాశనం అవుతుందని సీఐ శ్రీను, ఎస్ నీరేశ్ తెలిపారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడకుండా అవగాహన పెంపొందించే దిశగా జిల్లా పోలీస్‌శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బుధవారం చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి విద్యార్థులతో కలసి 2కే రన్ నిర్వహించారు. అనంతరం గంజాయి, డగ్స్, ఇతర మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లిలో ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలన్నారు.

❖ కంట్రోల్ రూమ్ సీఐగా మల్లేశ్‌గౌడ్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూమ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మల్లేశ్‌గౌడ్ సీపీ అనురాధను బుధవా రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి ఫోన్ కాల్‌కు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.